# Update on AIIMS, Bibinagar and services provided

## ఎయిమ్స్ సేవలకు ఆదరణ

- అందుబాటులోకి ఐసీయూ, పీడియాట్రిక్ విభాగాలు
- రోజూ 600 మందికి పైగా వైద్య పరీక్షలు

బీబీనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు బీబీనగర్ ఎయిమ్స్ అడుగులు వేస్తోంది. 2023 సంవత్సరం ముగిసే నాటికి పూర్తి స్థాయి వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఆసుపత్రిలో భవన నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎయిమ్స్ ప్రారంభమైనప్పటి నుంచి ఓపీ సేవలకే పరిమితం కాగా గడిచిన మూడు నెలల్లో ఇన్‌పేషెంట్ సేవలకు కూడా ఆదరణ పెరిగింది. ప్రస్తుతం 100 పడకలతో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, గైనకాలజీ, ఫ్యామిలీ మెడిసిన్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ విభాగాల్లో, 30 పడకలతో ఐసీయూ సేవలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతానికి ఎయిమ్స్‌లో సీటీ, ఎమ్మారై సేవలు మినహా, మిగతా అన్ని రకాల రక్త, మల, మూత్ర పరీక్షలు బయటి ఆస్పత్రులతో పోలిస్తే 25-49 శాతం రుసుముకే చేస్తున్నారు. 2023 నవంబరు నాటికి పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభిస్తామని ఇటీవల ఎయిమ్స్‌ను సందర్శించి కేంద్ర మంత్రులు భారతీప్రవీణ్ పవార్, దేవ్‌సిన్హాచౌహాన్ చెప్పిన నెలలోపే పనులు వేగవంతం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ ఎయిమ్స్‌కు రూ.1028 కోట్లు మంజూరు చేయగా వాటిలో



బీబీనగర్ ఎయిమ్స్‌లో ఓపీ సేవలకు వేచి ఉన్న రోగులు

నిర్మాణాలకు రూ.800 కోట్లు, వైద్య పరికరాల కొనుగోలుకు రూ.183 కోట్లు, మిగతా రూ.45 కోట్లు ఆసుపత్రి అభివృద్ధి పనులకు కేటాయించారు. నాగార్జున నిర్మాణ సంస్థ ఈ పనులను చేపట్టింది.

### పెరిగిన ఇన్‌పేషెంట్‌లు

ఎయిమ్స్‌లో జూన్ 2, 2020న ఓపీ ప్రారంభమైన సమయంలో కరోనా దృష్ట్యా రోగులు ఆసక్తి చూపలేదు. ఆ తర్వాత నెమ్మదిగా రోగుల తాకిడి పెరిగింది. ప్రస్తుతం రోజుకు 600 వరకు చికిత్స చేయించుకుంటున్నారు. 2021 జులై 14న ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభించినా కరోనా ప్రభావంతో గత మార్చి వరకు పెద్దగా ఆదరణ లభించలేదు. తర్వాత అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశారని, విభాగాల వారీగా వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిసి (మిగతా 6లో)

**ఓపికతో చూస్తున్నారు: సత్తిరెడ్డి, హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా**



నా ఎడమ కాలికి గాయం కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి కాలు కొంతమేర తీసేశారు. మధుమేహం రోగిని కావడంతో గాయం తగ్గడం లేదు. అప్పటి నుంచి ఆసుపత్రికి వెళ్లినప్పుడల్లా రూ. 10 వేల వరకు ఖర్చవుతోంది. మా బంధువుల సూచన మేరకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వచ్చాను. ఇక్కడి వైద్యులు రెండు రోజులు ఆసుపత్రిలో చేర్పించుకొని చికిత్స అందించారు. ఇక్కడ ఉన్న రెండు రోజులు ఓపికగా చూశారు. ఎప్పుడు వచ్చినా మంచిగా డ్రెస్సింగ్ చేసి పంపుతున్నారు. దారి ఖర్చులతో సహా రూ.2 వేలకు మించి కావడం లేదు.

మరిన్ని జిల్లా వార్తలు 5, 6, 8 పేజీల్లో...

nadu

# ఎయిమ్స్ సేవలకు ఆదరణ

**(మొదటి పేజీ తరువాయి)** ఇన్‌పేషెంట్ సేవలకు వరుస కట్టారు. ప్రస్తుతం నిత్యం 50 మంది వరకు ఇన్‌పేషెంట్ సేవలు వినియోగించుకుంటున్నారు.

## శిశువులకు పూర్తిస్థాయి వైద్యం

ఎయిమ్స్‌లో నవజాత శిశువులకు పీఐసీయూ ఏర్పాటుచేసి నాలుగు రేడియంట్ వార్మర్‌లు, సీపీఏపీ పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో శిశువులకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిసి చాలా మంది ఎయిమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎయిమ్స్ దత్తత తీసుకున్న యాదాద్రి జిల్లా బొమ్మలరామారం పీహెచ్‌సీలో నెలకు రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తుండడంతో అక్కడా స్పందన వస్తోంది. మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) ద్వారా జిల్లాలోని 8 గ్రామాలను దత్తత తీసుకొని వైద్య సేవలు అందిస్తున్నారు.

## నియామకాలు

బీబీనగర్ ఎయిమ్స్‌లో 138 మంది అధ్యాపకులు, 150 మంది నర్సింగ్ స్టాఫ్, 50 మంది సీనియర్ రెసిడెంట్స్, 50 మంది జూనియర్ రెసిడెంట్స్ నియామకాల ప్రక్రియ దాదాపు పూర్తయింది. మరిన్ని పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7న 9 మందితో పీజీ కోర్సు ప్రారంభమైంది. 2019లో 50 వైద్య విద్య సీట్లు, 2020లో 62, 2021లో 100 సీట్లు భర్తీ అయ్యాయి. ప్రస్తుతం మరో 100 సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తయింది. ఆసుపత్రిలో నిర్మాణ పనులు జరుగుతున్నందున వైద్య విద్యార్థులకు తాత్కాలికంగా సమీపంలోని అవుషాపూర్‌లో వసతి కల్పించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు భువనగిరి పాత కలెక్టరేట్ భవనంలో వసతి గృహ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## 2023 కల్లా అందుబాటులోకి..

**–డాక్టర్ వికాస్ భాటియా, డైరెక్టర్, ఎయిమ్స్, బీబీనగర్**



కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ప్రత్యేక చొరవతో బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోగులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఓపీ సేవలకు ఆదరణ పెరిగింది. నిత్యం 600 మందికి ఓపీ సేవలు అందుతున్నాయి. 2023 నవంబరు నాటికి అన్ని రకాల వైద్య సేవలందించే దిశగా పనిచేస్తున్నాం. అందుకు వైద్యులు, సిబ్బంది నియామకం దాదాపు పూర్తయింది. పీడియాట్రిక్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో ఆ రోగుల తాకిడి పెరిగింది. బొమ్మలరామారంలో 10 ఎకరాల్లో రూరల్ హెల్త్‌కేర్ సెంటర్ ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.